క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



మధ్యాహ్న భోజన వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ వీరప్రతాప్‌రెడ్డి

పాణ్యం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ వీర ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకోసం వండిన వంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. పరిశుభ్రమైన ప్రదేశంలో వంట తయారు చేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల మండల అధికారులు తప్పకు హాజరుకావాలని కోరారు.

వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: చెత్త సంపద కేంద్రాలలో సేకరించిన చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఈఓఆర్డీ నాగేష్‌తో కలసి నాయకల్లు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెల్లింపు



చెక్కును అందజేస్తున్న సొసైటీ చైర్మన్, సీఈఓ

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తికి చెందిన యూసుఫ్ 6 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడు కోడుమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సభ్యుడు కావడంతో జనతా బీమా కింద మృతుడి కుటుంబానికి రూ.2లక్షల పరిహారం మంజూరైంది. బీమా చెక్కును గురువారం మృతుడి భార్య జరీనాకు సొసైటీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంతరెడ్డి, కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ అయ్యస్వామి, సొసైటీ సీఈఓ ఉదయకుమార్‌రెడ్డి అందజేశారు.

మే 7న దామోదరం సంజీవయ్య విగ్రహావిష్కరణ

కల్లూరు:వచ్చే నెల (మే) 7న మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ విగ్రహావిష్కరణ కరపత్రాలు విడుదల చేశారు. దామోదరం సంజీవయ్య 1952 ఏప్రిల్ పదవ తేదీన రాజాజీ మంత్రి వర్గంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజును స్మరించుకుంటూ మే7న పెద్దపాడులోని ఆయన నివాసంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఈశ్వరయ్య, పోతుల శేఖర్, మురళి, మధు, అరుణ్, నరసింహమూర్తి, నజీర్ అహమ్మద్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

కర్నూలు(రూరల్): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ కర్నూలు నగరంలోని టౌన్ మోడల్ కళాశాలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆహ్వానించారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న ఎంపీ కార్యాలయంలో ఆయన్ను కలిసి ఆహ్వానం పలికారు.

మోయలేని భారం.. పొంచి ఉన్న ప్రమాదం

- 10 టన్నుల సామర్థ్యంలో 60 ఏళ్ల క్రితం కుందూనదిపై బ్రిడ్జి నిర్మాణం
- అధిక బరువు వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్న వైనం
- ఇప్పటికే పాక్షికంగా శిథిలమైన రక్షణగోడలు
- జీవితకాలం ముగుస్తున్నా మరమ్మతులకు నోచుకోని పరిస్థితి



బూజునూరు గ్రామం వద్ద కుందూనదిపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి (ఇన్‌సెట్) దెబ్బతిన్న రక్షణగోడ

గడివేముల: ఒకప్పుడు మండలంలోనే పెద్ద వంతెనగా పేరు. వందల క్యూసెక్కుల వరద నీటి ఉధృతిని తట్టుకుని నిలబడి నాటి ఇంజినీరింగ్ నైపుణ్యానికి మచ్చుతునకగా నిలిచిన నిర్మాణం. ఇదంతా గతం.. ప్రస్తుతం సామర్థ్యానికి మించిన భారం మోయలేక, నిర్వహణ లేక, మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరింది ఆ వారధి. ఆ సేతువు భద్రత గాల్లో దీపంలా మారింది.

60 ఏళ్ల క్రితం నిర్మాణం

మండల పరిధిలోని బూజునూరు వద్ద నందికొట్కూరు – నంద్యాల ప్రధాన రహదారిపై కుందూ నదిపై ఆరు దశాబ్దాల క్రితం బ్రిడ్జి నిర్మించారు. అప్పుడు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నిర్మించారు. నాటి అవసరాల ప్రకారం గరిష్ఠంగా 10 టన్నుల సామర్థ్యాన్ని మించి నిర్మించే అవకాశం లేదు. దీని ఆర్‌సీసీ(రీఇన్ ఫోర్స్ డ్ సిమెంట్ కాంక్రీట్) పద్ధతిలో కట్టి రహదారులు మరియు భవనాల శాఖకు అప్పగించినట్లు అధికారులు చెబుతున్నారు. దీని జీవిత కాలం 50 నుంచి 70 సంవత్సరాలు వరకు ఉండొచ్చని.. అది సరైన మరమ్మతులు నిర్వహించినపుడు మాత్రమే సాధ్యం.

నిర్వహణ శూన్యం

అప్పటి వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ బ్రిడ్జికి కొన్నేళ్ల నుంచి గడ్డు కాలం దాపరించింది. సమీపంలోని జిందాల్ సిమెంట్ పరిశ్రమకు బళ్లారి, తెలంగాణ నుంచి స్లాగ్ లాటరైట్, కార్బన్‌పౌడర్ తదితర ముడి పదార్థాలను తరలించేందుకు ఉపయోగిస్తున్న ట్రాయలర్లు, భారీ లారీలు తిరిగుతూ వంతెనను కుంగదీస్తున్నాయి. రమారమి 50 టన్నుల పైనే బరువుతో వెళ్తున్న వాహనాలతో విపరీతమైన ఒత్తిడికి గురవుతోంది. బ్రిడ్జి అడుగుభాగాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అవగతమవుతుంది. అడుగు భాగంలో గోడలు పగుళ్లిచ్చాయి. 30 శాతం పైనే రక్షణ గోడలు శిథిలమయ్యాయి. 2015–16 సంవత్సరం రూ.10 లక్షలతో మరమ్మతుల ప్రతిపాదనలు పంపగా... అవి నేటికీ ఆచరణకు నోచుకున్న పాపాన పోలేదు. రాష్ట్ర రహదారి 48పై ఉన్న ఈ వంతెనపై తరచుగా శాఖాధికారులు తిరుగుతున్నా కనీసం, పరిమితి గురించి సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం విచారకరమని వాహనదారులు చర్చించుకుంటున్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మించండి



మా గ్రామం వద్ద సమీపంలో నంద్యాల రహదారిపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జి కింద పగుళ్లు ఏర్పాడ్డాయి. దీంతో పాటు బ్రిడ్జి రక్షణ గోడలు కూలిపోయాయి. ఎక్కువ లోడు వాహనాలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. దాని స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలి. – చిన్న శాలు, బూజునూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన వీరబ్రహ్మయ్య

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లాకు చెందిన తెన్నేటి వీరబ్రహ్మయ్య (65) మృతి చెందాడు. మైదుకూరు – బద్వేలు రహదారిలోని గోపిరెడ్డిపల్లె వద్ద సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బద్వేలు వైపు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన వీరబ్రహ్మయ్య గ్రామంలోనే పురోహితుడుగా పనిచేస్తున్నాడు. ప్రొద్దుటూరులో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన అక్కడ నుంచి స్వయంగా కారు నడుపుకుంటూ బద్వేలుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది కారులో ఇరుక్కుపోయిన వీరబ్రహ్మయ్య మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మల్లేశ్వరమ్మ, వివాహితులైన ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఇళ్ల పట్టాలు రద్దు చేయొద్దు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన లబ్ధిదారులు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేయవద్దని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాగన్న మా ట్లాడుతూ.. నన్నూరు గ్రామంలో గత ప్రభుత్వం ఇచ్చిన పేదల ఇళ్ల పట్టాలను రద్దు చేయకుండా.. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అర్హతగల వారిని గుర్తించాలన్నారు. వారి ప్లాట్లకు నంబర్లు వేయాలని కోరారు. గత ప్రభుత్వంలో పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోగా, నిరుపేదలైన వారిని గుర్తించి సెంటున్నర స్థలం ఇవ్వడం జరిగిందన్నారు. అంతలోగ ఎన్నికల కోడ్ రావడంతో నంబర్లు వేయకుండా వదిలేశారని తెలిపారు. నూతనంగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఒత్తిళ్లతో ప్లాట్లను రద్దు చేస్తామని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మల్లికార్జున, మధు, సురేష్, పుల్లమ్మ, వెంకటేశ్వరమ్మ, రజియాబీ, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్

కల్లూరు : ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 28వ వార్డు ఆశ్వర్థపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించి పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో లభించే భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉంటుందన్నారు. ఎటువంటి కారణం లేకుండా దంతాలు పసుపు రంగులోకి మారితే ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చిందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఎముకలలో నొప్పి ఉంటే వైద్యుడిని సంప్రదించాలన్నారు. నీటిలో ఫ్లోరైడ్ ఉండే ప్రాంతాల్లో ఉసిరి, నారింజ, ద్రాక్ష వంటి పండ్లను వాటిని ఆహారంలో చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కీర్తి, ఉపాధ్యాయులు హుస్సేనయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోమియోపతి దినోత్సవం



పోలకల్ పీహెచ్‌సీలో శ్యామూల్ హానిమాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని గురువారం పోలకల్ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. హోమియోపతి పితామహుడు శ్యామూల్ హానిమాన్ చిత్రపటానికి డాక్టర్ హుసేన్ బీబీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పూలమాల వేసి నివాళులు అర్పించారు. హోమియోపతి వైద్యంలో రోగి శరీర స్వభావాన్ని బట్టి వ్యాధులను నయం చేయవచ్చని తెలిపారు.ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవన్నారు. హోమియో వైద్య విధానాలు, ప్రయోజనాలు తెలియజేశారు.

కేతవరం పాఠశాల స్థాయి పెంపు



మాట్లాడుతున్న ఎంఈఓ ఓంకార్‌యాదవ్

ఓర్వకల్లు : మండలంలోని కేతవరం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచినట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. గురువారం పాఠశాలల తనిఖీలో భాగంగా కేతవరం పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటి వరకు ఉనన ప్రాథమికోన్నత పాఠశాలలో 1–8వ తరగతి వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారన్నారు. పాఠశాలకు రవాణా సౌకర్యాలు సరిగా లేవనే ఉద్దేశంతో ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆమోదం తెలిపిందని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9, 10 తరగతులు ఇక్కడే బోధిస్తారని తెలిపారు. పాఠశాల విస్తరణ కోసం స్థలసేకరణ చేయవలసిందిగా కమిటీ సభ్యులకు సూచించారు. అంతకు ముందు పూడిచెర్ల పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు విజయలక్ష్మి, శేఖర్‌నాయక్, ఎస్ఎంసీ చైర్మన్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.



దిబ్బకాదు.. డ్రైనేజీ

కల్లూరు : మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలోని డ్రైనేజీ కాలువలో మొత్తం చెత్తా చెదారం, పేపర్లు, ప్లాస్టిక్ సంచులతో నిండి ఉండడంతో మురుగు నీరు వెళ్లడం లేదు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో ఉన్న చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులపై చర్యలు

కర్నూలు సిటీ: సీజనల్ హాస్టళ్ల నిర్వాహణలో నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ టి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లకు అనుమతులు రాగా 34 ఏర్పాటు చేశామన్నారు. వీటి నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలకు అప్పగించామన్నారు. అయితే వారు నిర్వహించడంలో నిబంధనలు అతిక్రమించిన ఏడు స్వచ్ఛంధ సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టామని, 8 స్వయం సహాయక సంఘాలకు బిల్లులో కోతలు విధించామన్నారు.

చేనేతలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



చేనేత సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న మాధవస్వామి

కోడుమూరు రూరల్: చేనేత కార్మికులు నేసే చీరలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం 90వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోడుమూరులో చేనేత సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ.. చేనేత కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. చేనేత కార్మికుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, సబ్సిడీ డిపోలను ఏర్పాటు చేసి ఏడాదికి రూ.36వేల యారెన్ సబ్సిడీ బుక్కులివ్వాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి చేనేత కార్మికుడికి పింఛన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, మహబూబ్‌బాషా, స్థానిక నాయకులు నరసింహులు, శంకర్, బాబు, గిడ్డయ్య, లక్ష్మన్న, రవి, వెంకటేశ్వర్లు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, చౌక డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు: గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస హోటల్, గ్రాండ్ ఫాస్ట్ ఫుడ్, జావెద్ హోటల్, గోల్డెన్ ఫుడ్ ప్లాజాలో తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్‌ను హోటళ్లలో వినియోగిస్తున్నట్లు గుర్తించి ఐదు సిలిండర్లను సీజ్ చేసి నంద్యాల సీఎస్‌డీటీకి వాటి సంరక్షణ నిమిత్తం అప్పగించారు. అలాగే రెండు చౌక డిపోల్లో కూడా తనిఖీలు నిర్వహించి నిల్వలకు, రిజిస్టర్‌లో వ్యత్యాసం ఉండటంతో 1955 అండర్ సెక్షన్ 6(ఎ) కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

దాడిచేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సి.బెళగల్: తమపై కొడవళ్లు, కర్రలతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారి వివరాల మేరకు.. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన చాపలకూర ఈశ్వరయ్య కుమారుడు వీరాంజనేయులును ఉక్మ వీరేష్ అనే వ్యక్తి బుధవారం రాత్రి మద్యం మత్తులో దాడి చేశాడు. విషయాన్ని వీరాంజనేయులు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వెళ్లి ప్రశ్నించారు. దీంతో ఉక్మ వీరేష్, అతని కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీను, చనుగండ్ల నాయుడు, వెంకటేష్, హరి, పులిరాజు, నాగరాజు తదితరులు చాపలకూర ఈశ్వరయ్య, చాపలకూర ఆంజనేయులు, రంగమ్మ, సుధాకర్ తదితరులపై కొడవళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈశ్వరయ్య, ఆంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభం

- నేడు కోదండరాముని కల్యాణం
- రేపు హనుమాన్ మహా రథోత్సవం



తెలుగు వీధిలో కొలువైన పడమటి ఆంజనేయస్వామి



జయంతి వేడుకకు సిద్ధమైన మహారథం

సి.బెళగల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సి.బెళగల్ తెలుగు వీధిలో కొలువైన పడమటి ఆంజనేయస్వామికి గురువారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం గణపతి పూజ, పణ్యాహవాచనం, కలశ స్థాపన, వాస్తు, నవగ్రహ పూజలు, సర్వతోభద్ర దేవతల ఆహ్వానం, మంగళహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం (నేడు) చైత్రశుద్ధ చతుర్ధశి రోజున అగ్ని ప్రతిష్ఠాపన, దీక్షా హోమం అనంతరం ఉదయం 11:16 గంటలకు మిథున లగ్నంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. శనివారం చైత్రశుద్ధ పూర్ణమి రోజున ఉదయం ఆంజనేయ స్వామికి పంచామృతభిషేకం, రథాంగ హోమం, మధ్యాహ్నం తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు గ్రామంలో ఆంజనేయస్వామి మహా రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే రోజు పూర్ణాహుతి, కుస్మాండబలితో ఉత్సవాలు ముగియనున్నాయి.

శ్రీవారి గరుడసేవకు సర్వం సిద్ధం



స్వామిఅమ్మవార్ల ఉత్సవవిగ్రహాలు



సిద్ధం చేసిన గురుడ వాహనం

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కోనా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, రక్షబంధనం తదితర పూజలు చేశారు. శుక్రవారం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించనున్నట్లు ఆలయ పూజారి వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. మిఠాయిలు, బొమ్మల దుకాణాలు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.



క్రిష్ణదొడ్డిలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

13న బాలికల క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు క్రికెట్ జట్ల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె. దేవేంద్ర గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–15, 19, 23, అలాగే సీనియర్ బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2010 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారు అండర్–15 జట్టు ఎంపికకు అర్హులని తెలిపారు.

ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ గడువు పొడిగింపు

కర్నూలు (టౌన్): ఆస్తి పన్ను బకాయిదారులకు ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ మాఫీ గడువును పొడిగించినట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. క్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ నాటికి ముగిసిన ఈ గడువు ఈనెలాఖరు వరకు ఉంటుందన్నారు. ఈ ఏడాది పన్ను మొత్తం చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించిందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com